శ్రీ గురుభ్యోనమః

## నీరులా, నీడలా, నిలువలేని కాడలా...

జీవిద్దాం ఇలానే!
ఈ సంకుచించుకుపోయిన మన ప్రపంచంలోనే!
పయనిద్దాం ఈ ఇరుకు దారుల్లోనే!
మనమంతా నిమిత్త మాత్రులమని!
జగమంతా ఈశ్వర తత్వమని!
కర్త, కర్మ, తప్పొప్పులు మంచిచెడులు,
అంతా "పై" వాడి భారమని
మన మానాన మనం బతుకు వారమని...
జీవిద్దాం! జీవిద్దాం ఇలానే!
తప్పించుకుంటూ మతితప్పిన మాయావాదుల్లానే
జీవిద్దాం!
జీవిద్దాం ఇలానే!

లేదు కదా మనకంటూ వ్యక్తిత్వం
లేదు కదా మనదంటూ జీవితం
రాదు కదా మనకోసం,
రచించే మంచి భవితవ్యం!
జీవిద్దాం ఇలానే!
నీరులా, నీడలా, నిలువలేని కాడలా...
అమ్ముడు పోతూ ఎవడు కొనుక్కుంటే వాడికి!
తలూపుతూ ఎవడేదంటే దానికి!
మొద్దుల్లా, ఎద్దుల్లా, గంగిరెద్దుల్లానే జీవిద్దాం!
జీవిద్దాం ఇలానే!
చెదిరి పోతూ, చెరిగిపోతూ
ఈకల్లా, ఆకుల్లా, వాడిన పూరేకుల్లా ...
జీవిద్దాం ఇలానే!
నీరులా, నీడలా, నిలువలేని కాడలా!
జీవిద్దాం! పయనిద్దాం!
జీవిద్దాం ఇలానే...

- 04-20-05
యోగానంద్

PTO

<u>వివరణ:-</u>

<u>నీరు, నీడ, నిలువలేని కాడ</u> :- వ్యక్తిత్వం లేకపోడానికి సూచకం, అలానే ఈక, ఆకు, పూరేకు కూడా.

<u>అమ్ముడు పోతూ...</u> :- లంచాలు, కట్నాలు, గుర్తింపు కోసం దేహాన్నమ్మేవాలు (Pseudo intellectuals)

<u>మతి తప్పిన మాయావాదులు</u>:- నిజమైన వేదాంతుల, వేదాంత ధోరణికి కలిగిన వారికి కాదు. సరైన అవగాహన లేకుండా, "తప్పు, ఒప్పు మనం కాదు కదా నిర్ణయించేది..." అంటూ కర్తవ్యహీనులై వర్తించే వారిని విమర్శిస్తూ చెప్పిన వాక్యం. మనం కాపోతే మరెవరు చెప్తారో తప్పొప్పులు! కాలం ఎంత మారినా, సామాన్య ధర్మం మారదు కదా! సామాన్య ధర్మం ప్రకారమే గా అన్నీ నిర్ణయించబడేది! మరి ఈ "తప్పొప్పులు, మంచి చెడులు, నిర్ణయించడానికి మనమెవరు?..." అంటూ ఈ వింత వాదన ఎక్కడ్నుండి, ఎప్పట్నుంచొచ్చిందో! మానవుడు కాపోతే ఎవడు నిర్ణయిస్తాడిది?